నూరేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం-34**

నూరేళ్ళ తెలుగు కథకు



# నా కథల్లోని పాత్రలు బాధ్యతల్ని విస్మరించవు

**- జయంతి వెంకటరమణ**


కథలు ఊరకే రావు; మన పుట్టుక, ఎదుగుదల, పెరిగిన వాతావరణం, కలసిన వ్యక్తులు, తారసపడ్డ ఉదంతాలు కథా నిర్మాణానికి దోహదం చేస్తాయి అంటారు ప్రముఖ రచయిత జయంతి వెంకటరమణ. జీవితంలోని సంఘటనలే తన కథలన్నింటికీ పునాదులంటారు. ఎంచుకున్న కథా వస్తువు నేపథ్యాన్ని తెలుసుకోడానికీ, వాతావరణాన్ని పరిశీలించడానికి, రోజుల తరబడి తిరిగి పరిశోధించిగానీ కథకు ఓ రూపాన్నివ్వరు. దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వాన్ని అమితంగా అభిమానించే ఈయన తొలినాళ్లలో 'ఊర్వశి' కలం పేరుతో ఎక్కువ కథలు రాశారు. బహుమతి పొందిన 'వంతెన' కథ నుంచీ స్వంతపేరుతో రాస్తున్న జయంతి వెంకటరమణ ఇప్పటివరకూ వందకు పైగా కథలు రాశారు. ఆ ప్రముఖ రచయితతో ఈ వారం ఇంటర్వ్యూ...

## బాల్యం నుంచే బతుకుపోరు

భద్రాచలంలో 1943 జనవరి 7వ తేదీన పుట్టాను. మా అమ్మ కనక కామేశ్వరి, నాన్న బలరామస్వామి. ఆయన భద్రాచలం హైస్కూల్లో ఇంగ్లీషు, సోషల్ బోధించే ఉపాధ్యాయుడుగా పని చేస్తుండేవారు. మాది చాలా పెద్ద కుటుంబం. మా తల్లిదండ్రుల సంతానంలో నేను నాలుగో వాడిని. నాకు ముగ్గురు అక్కలు, ఒక అన్న, ముగ్గురు చెల్లెళ్లు, ఒక తమ్ముడు. రిటైరైనా ట్యూషన్లు చెబుతూ కుటుంబాన్ని పోషించేవారు నాన్న. చిన్నతనంలోనే ఓసారి, డిగ్రీ పరీక్షల ముందు రెండు సార్లు మలేరియా వచ్చింది. మధ్యలో మశూచికం పడి కొంతకాలం మంచం పట్టాల్సి వచ్చింది. ఇలా బాల్యం నుంచి అనారోగ్యం నా చదువును ఆటంకపరిచింది. అయినా పోరు సలిపి ఎం.ఎ వరకూ అంచెలంచెలుగానైనా చదివి అధ్యాపక వృత్తిని చేపట్టగలిగాను. చిన్నచిన్న ఉద్యోగాలతో ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కో గలిగాను.

## అన్నయ్యే మార్గదర్శి

మా అన్న 'రామం' మంచి గాయకుడు, కవి కూడా. పుస్తకాల పురుగు. నాకు ఆనాటి భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, స్వతంత్ర వంటి పత్రికలు చదివే అలవాటు చిన్న వయస్సులో మా అన్నయ్య వల్లే వచ్చింది. బాల, చందమామ, బాలమిత్ర అప్పటి మా బాల్య నేస్తాలు. తెలుగుపై నాకు మక్కువ పెరగడానికి అన్నయ్యతో పాటు మా తెలుగు మాస్టారు 'పోవూరి నరసింహం' ఇంగ్లీషు, లెక్కలు చెప్పే 'వడలి మందేశ్వరరావు', 'డి.వి.ఆర్. భాస్కరశాస్త్రి', లైబ్రరి ఇన్‌చార్జ్‌గా ఉండే 'అప్పలాచార్యులు' ఎంతో సహకరించారు. దువ్వూరి రామిరెడ్డి, గురజాడ అప్పారావు రాసిన కవితలు దొరికితే వాటిని అప్పుడే కూనిరాగాలు తీసి పాడే వాణ్ణి.



అర్ధాంగి వాణీహేమలత, కుమారుడు శ్రీనివాస శ్రీహర్షతో...

## బాలల కథతో సాహిత్య ప్రస్థానం

నేను ఏడో తరగతిలో ఉన్నప్పుడు ఒక కథ రాశాను. మా అన్నయ్య దాన్ని సరిచేసి 'బాలమిత్ర' పత్రికకు పంపాడు. 'రెండు ప్రాణులు' అన్న పేరుతో ఆ కథ అచ్చయింది. అది నా మొదటి కథ. 'నువు బాగానే ఆలోచిస్తున్నావు. మంచి భాష నేర్చుకుంటే మంచి కథలు రాయగలవు' అని భుజం తట్టారు ఆ కథ చదివిన మా నాన్నగారు.

## నా డిటెక్టివ్ పేరు 'ప్రద్యుమ్న'

నా అనారోగ్యరీత్యా నాన్నగారు నన్ను బయటకు పంపడానికి ఇష్టపడక పోవడంతో కాలేజీ చదువుకు ఒక సంవత్సరం దూరమయ్యాను. ఆ యేడాది కాలంలో డిటెక్టివ్ పుస్తకాలను విరివిగా చదివాను. డిటెక్టివ్ కథలు రాయడం మొదలు పెట్టాను. నేను సృష్టించుకున్న డిటెక్టివ్ పేరు 'ప్రద్యుమ్న'. పోలీస్ ఇన్‌స్పెక్టర్ పేరు గోవిందరాజులు నాయుడు. 'కథలు రాయి, కానీ చదువు పాడు చేసుకోకు' అని సలహా ఇచ్చారు నాన్న. కుటుంబ పోషణలో నాన్న, అన్నయ్య పడుతున్న శ్రమ అప్పుడే గుర్తించాను నేను. అప్పటి నుంచే కుటుంబం అంటే ఒక బాధ్యతగా ఉండే వాణ్ణి. నా కథల్లోని పాత్రలకు దానిని ఆపాదించేవాణ్ణి.

## 'ఊర్వశి' పేరుతోనే ఎక్కువ రాశాను

అన్నయ్య ఉద్యోగరీత్యా, నా చదువుల కోసం ఒరిస్సా, ఆంధ్రాలో చాలా ప్రాంతాలు తిరిగాం. ఆ నేపథ్యంలో 1964లో బి.ఇడి చదవడానికి విజయనగరం వచ్చాను. అప్పుడు రాసిన నా మొదటి సాంఘిక కథ 'క్షంతవ్యుడు' 'యువ' పత్రికలో అచ్చయింది. కథలు రాయగలనన్న నమ్మకం నాలో దృఢమైంది. కృష్ణశాస్త్రి కవిత్వమంటే నాకు చాలా ఇష్టం. అందుకే 'ఊర్వశి' కలం పేరుతోనే కథలు రాసే వాణ్ణి. 'వంతెన' కథకు బహుమతి వచ్చినప్పుడే అసలు పేరు అచ్చులో కొచ్చింది.

## కారా మాస్టారితో కథలపై చర్చలు

శ్రీకాకుళంలోని మురపాగ గ్రామంలోని స్కూల్లో నాకు సైన్స్ టీచరుగా ఉద్యోగం వచ్చినప్పుడు కాళీపట్నం రామారావు గారిని కలవడం జరిగింది. తరచు కథల గురించి చర్చించుకునే వాళ్లం. ఆ రోజుల్లోనే 'యువ' మాసపత్రిక యాజమాన్యం రామారావు గారి 'యజ్ఞం' కథను ఏడాది పాటు తమదగ్గర ఉంచుకుని తర్వాత ప్రచురించినట్టు గుర్తు.

## 'మందస'లోనే మంచి కథలు రాసాను

మురపాగ నుంచి 'మందస' గ్రామానికి బదిలీ అయ్యాను. ఆ రోజుల్లో నక్సలైట్ల సంచారం, దురంతాలు, పోలీసుల నిఘా ఆ ప్రాంతాల్ని ఎంత కదిలించినా ప్రజా జీవనానికి అడ్డంకులుగా ఉండేవి కావు. ఒరియా, తెలుగు సంస్కృతుల మిళిత ప్రాంతమది. నన్ను నిత్యం కనిపెట్టుకునే మంచి మిత్రులుండే వారక్కడ. అక్కడున్నప్పుడే చాలామంచి కథలు రాశాను. ముఖ్యంగా 1973లో 'ఆంధ్రప్రభ' దీపావళికి నిర్వహించిన కథల పోటీలో మొదటి బహుమతి గెల్చుకున్న 'వంతెన' కథ అక్కడున్నప్పుడు పుట్టినదే! ఆ కథను నడిపించడానికి నేను రెండు మూడు రోజులు 'మందస' రైల్వేస్టేషన్‌లో ఉండవలసి వచ్చింది.

## 'పొన్న' కథల సంపుటి – బిఇడి విద్యార్థులకు పాఠ్యగ్రంథం

తరువాత 1976లో తెలుగు ఎమ్మే ప్రైవేటుగా చదివి 1978లో శ్రీకాకుళం మహిళా కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా చేరాను. అక్కడే సాహితీ మిత్రుల సంఖ్య పెరిగింది. మధురాంతకం రాజారాం వంటి ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి. అక్కడున్నప్పుడే కా.రా మాస్టారి సహకారంతో పురాణం సుబ్రహ్మణ్యంశర్మ పర్యవేక్షణలో 1981లో 'పొన్న' అన్న కథల సంపుటిని ప్రచురించడం జరిగింది. అందులో ఉన్న అయిదు కథల్లో 'వంతెన' ఒకటి. ఆ పుస్తకానికి 'పురిపండా అప్పలస్వామి గారు' ముందు

## నాకు నచ్చినవి

| | | |
|---|---|---|
| కవి | : | దేవులపల్లి కృష్ణశాస్త్రి |
| రచయిత | : | బలివాడ కాంతారావు |
| కవి | : | శ్రీశ్రీ |
| కథ | : | నల్లజర్ల రోడ్డు (దేవరకొండ బాలగంగాధర తిలక్) |
| నవల | : | వంశధార (బలివాడ కాంతారావు) |
| సినిమా | : | మల్లీశ్వరి (పాతది) |
| పాట | : | ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు (మల్లీశ్వరి) |
| నటుడు | : | కొంగర జగ్గయ్య |
| నటి మరియు గాయని | : | పి.భానుమతి |
| గాయకుడు | : | ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం |
| బంధువులు | : | జయంతి రామం (అన్నయ్య) |
| | : | గూటాల నాగరత్నం (చిన్నక్క) |
| వంట | : | బంగాళాదుంపల వేపుడు |
| తీరిక వేళల్లో | : | ఏకాంతంగా రాసుకోవడం లేదంటే చదువుకోడం అంటే ఇష్టం |



సన్మానితునిగా...

మాట రాశారు. ఇది 1983 నుండి సుమారు ఏడు సంవత్సరాల పాటు మైసూరు యూనివర్శిటీ బిఇడి తెలుగు విద్యార్థులకు అయిదో సెమిస్టర్‌లో పాఠ్యగ్రంథంగా కొనసాగింది. ఆ పుస్తకంలోని 'ఆకాశదీపం' 'కొడిగట్టిన దీపాలు' కథలు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం వారు హెచ్.ఎస్.సి విద్యార్థులకు పాఠ్యగ్రంథంలో అధ్యయనానికి తీసుకున్నారు. జనవరి 2009లో వచ్చిన 18 కథలున్న నా మరో కథా సంపుటి పేరు 'ఆశ్లేష'.

### పార్వతీపురంలో మంచి సాహితీ వాతావరణం

1989లో బదిలీ అయి పార్వతీపురం కాలేజీకి వెళ్లవలసి వచ్చింది. అంతకుముందు విశాఖ జిల్లా పెందుర్తిలో కొన్నాళ్లు పని చేసినా అక్కడి సాహితీ సమావేశంలో నాకు చైతన్యం కనిపించలేదు. పార్వతీపురంలో కవి సమ్మేళనాలు, సాహితీచర్చలు నాకు నచ్చాయి. మళ్లీ విశాఖకు ట్రాన్స్‌ఫర్ అయ్యాకే భరాగో, ఘండికోట బ్రహ్మాజీరావు, బలివాడ కాంతారావు వంటి సాహితీ మిత్రులతో పరిచయాలు పెరిగి, స్నేహం బలపడింది. మా బావ 'గూటాల కృష్ణమూర్తి'కి నేనంటే అభిమానం.

### ఒకే ఒక్క నవల

కథ నిడివి తగ్గించి రాయడం ఇప్పుడిప్పుడే అలవాటు చేసుకుంటున్నాను. అలా అని పొడిగించి నవలలూ రాయలేను. ఒకే ఒక్క నవల 'కల్యాణతిలకం' రాశాను. అది అప్పటి 'ప్రజామాత' పక్ష పత్రికలో సీరియల్‌గా వచ్చింది.

### రేడియో, టీవీల్లో ప్రసారమైనవి

'వంతెన' కథ రేడియో నాటికగా, టి.వి. నాటకంగా ప్రసారమయింది. 'తెల్లవారింది' అనేకథ ఓ చానెల్‌లో 2001లో బాలల దినోత్సవం నాడు టెలీప్లేగా ప్రసారమై, తరువాత సంవత్సరంలో ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికయింది.

### ప్రభావం

టాల్‌స్టాయ్ కథలెన్నో సార్లు చదివాను. అతని మానవతావాదం నాకు నచ్చుతుంది. అలాగే శరత్ సాహిత్యం కూడా. వారి ప్రభావం నా మీద ఉంది. 'ప్రముఖుల రచనలు చదువు. వారిని అనుకరించకు' అనేవాడు మా అన్నయ్య. చిన్నప్పటి నుండి చదవటమే ఇష్టమైన నాకు, తరువాత కాలంలో కథలు రాయడం మరింత ముఖ్యమైన ఇష్టమైంది. కథా రచన ప్రారంభించిన తొలినాళ్లలో నా చుట్టూ ఉన్న సమాజమే నా కలంలో సిరా అయింది. ఆ 'ఇంకు' ఇంకిపోకూడని నా ఆకాంక్ష. చూచిన దాన్ని చెరిగిపోని దృశ్యంగా మలచుకొని, చూచిన మనుషుల రూపురేఖల్ని స్పష్టంగా దిద్దుకుని, మాటల్ని యాసని, మాండలికాన్ని జారిపోనీకుండా పట్టుకుని కథలలో ప్రోది చేసుకుంటాను.

### అభిలాష

పెందుర్తి శ్రీ వెంకటేశ్వరస్వామి సేవలో తరిస్తున్నాను. సమాజ హితవు కోరే మంచి కథలు రాస్తూ తెలుగు సాహితీవనంలో తులసి మొక్కలా శేష జీవితం గడిచిపోతే చాలు.

### ఇప్పుడొస్తున్న కథల గురించి....

ఖచ్చితంగా చెప్పాలంటే పాత కథల్లో కొంత చాదస్తం ఉండేది. ఇప్పటి కథల్లో అది లేదు. మారుతున్న విలువలు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కథల్లో చాలా మార్పు వచ్చింది. పత్రికలు ప్రోత్సహిస్తున్నాయి. మంచి కథలే వస్తున్నాయి. వర్ధమాన రచయితలకు కథలపై చక్కటి అవగాహన ఉంది.

**-మేడా మస్తాన్‌రెడ్డి**

**నాకు నచ్చిన నా కథ**

# వంతెన

**- జయంతి వెంకటరమణ**


బొమ్మ: బాపు

చిక్కటి చీకటి.
ఆకాశం మీద నల్లని మబ్బులు
సన్నగా వాన.
దురుసుగా ఈదురుగాలి
ప్లాట్‌ఫారం మీద అక్కడక్కడ దూరదూరంగా ఉన్న తురాయి, గంగరావి చెట్లు వర్షంలో తడుస్తూ తలలు వంచుకుని నిలుచున్నాయి.
లాంపు పోస్టుల మీద ఉన్న చమురుదీపాలు కొడిగట్టబోతున్నాయి.
రైల్వేలైన్ల అవతల 'చిన్నూరు'లో పోగుపడ్డ పూరిళ్లు ఆ చలికి ఆ చీకటిలో కంబళి కప్పుకుని నిద్రకు జోగుతున్నాయి.
ఊరి మధ్య చెరువు గట్టునున్న చింతచెట్ల మీద బుషి పక్షులు స్వేచ్ఛగా ప్లాట్‌ఫారం మీదికి అప్పుడప్పుడు దాడి చేస్తున్నాయి.

స్టేషను మాస్టరు గదిలో గోడ గడియారం ఒక గంట కొట్టింది. గడియారంలో ముళ్లు మాత్రం పద కొండు గంటలనే చూపుతున్నాయి.

స్టేషను మాస్టరు రాఘవరావు తలఎత్తి గడి యారం వైపొకసారి చూచి, హరికేన్ లాంతర్ని ప్లాట్ బాక్సుకు దగ్గరగా జరిపి కుర్చీలో వెనకకు చేరగిలా పడ్డాడు.

''మాస్టారూ! పాసెంజరు బండి ఎన్ని గంటలకు వొస్తుందండీ?''

తలఎత్తాడు రాఘవరావు. ద్వారం దగ్గర పద్దెని మిదేళ్ల ప్రాయంలో ఉన్న యువతి అడుగుతూంది. ఆకాశంలో సన్నని మెరుపు ఏ సవ్వడి లేకుండా అల్లరి పిల్లలా చెంగున పరుగెత్తింది.

''ఏ పాసెంజరు బండమ్మా?'' అడిగాడు రాఘవరావు.

''హైదరాబాదు వైపుపోయే పాసెంజరండి. సామర్లకోటకు కూడా పోతుంది కదండీ అది.'' బెదురు బెదురుగా చూస్తూ అడిగిందామె.

''ఆహాఁ! ఆ ట్రెయినా? నిజానికైతే అది ఈ వేళకు ఈ ఊరుకు రావలసిందే. కాని. ఈ రోజు రెండు గంటలు లేటు. ఒంటిగంటకు వస్తుంది''.

''రెండు గంటలే! ఆ ట్రెయిన్‌కు ముందుగా వచ్చే మరే ట్రెయిను లేదాండి?''

సుమారుగా ద్వారానికి అతుక్కుపోయి ఉందామె. కుడికాలు గుమ్మం మీదుంచి కుడి చేతితో ద్వారాన్ని పట్టుకుని నిలుచుంది. ఆమె ముఖంతప్ప పూర్తి రూపం రాఘవరావుకు గోచరం కాలేదు. ఆమె మాటాడుతూంటే ఆమె కనులు మాత్రం వింతగా కదులు తున్నాయి. రాఘవరావు భ్రుకుటి ముడిచి కుర్చీలోంచి లేచి నాలుగడుగులు వేసి, ''లేదమ్మా! ఒకవేళ ఉన్నా, పాసెంజరు బండి తప్ప మరే ట్రెయినూ ఆగదు. ఏం చేస్తామమ్మా! మాది చిన్నస్టేషను. మేం చిన్న మాస్టర్లం. ఏ ఊరు వెళ్లాలమ్మా?'' అన్నాడు.

''సామర్లకోట కెళ్లాలండి'' బెదురు బెదురుగా చూస్తూ అంది.

''అబ్బో! చాలా దూరమే! అందులో పాసెంజరు బండిలో ప్రయాణం విసుగ

నిపిస్తుంది. ఏం చేస్తాం? ఈ స్టేషన్లలో మెయిలు ఆగదు. మరీ మీ ఊరిలో ఆగినట్టు ప్రతి స్టేషనులో ఆగితే నేను 'మెయిలు' నెలా అవుతానంటుంది ఆ పట్టపురాణి''.

''అవునండి అదీ నిజమే కదండి? మాస్టారూ! ఈ ట్రెయిన్ ఆ ఊరు చేరేసరికి వెలుగు వచ్చేస్తుందాండి?''


''వెలుగు రాకేం? బాగా ఎండే కాస్తుంది''

''పోనీలెండి. స్టేషన్‌నుండి ఊరులోకి వెళ్లటానికి జట్కాలు దొరుకుతాయాండీ?'' నలు దిశలా పరికిస్తూనే అడిగిందామె.

''జట్కాలు, రిక్షాలు, టాక్సీలు దొరకుతాయమ్మా. ఏమమ్మా! ఇంతకుపూర్వం ఆ ఊరెప్పుడూ వెళ్లలేదా?''

''లె... లె... లేదండీ''

''అయినా ఫరవాలేదు. నాకా ఊరు బాగా తెలుసు. నే చెబుతాలే!.... ఆఁ! అవతల చీకటిగా లేదూ? నిన్నటి నుండి ఆకాశం 'కురుస్తాన్! కురుస్తాన్! కొంపలు కూల్చేస్తాన్!' అంటోంది. మట్టివాసన వేస్తోంది. వర్షం చినుకులు గాని పడుతున్నాయా?''



''సన్నగా వానపడుతోందండి'' అంది చేతుల మీద, నుదుటి మీద పడ్డ వర్షపు చినుకులు తుడుచుకుంటూ.

''అయ్యో! వర్షంలో తడిసినట్టున్నావు. వచ్చి అలా ఆ బల్లమీద కూర్చో, అమ్మా! నీతో మరెవరైనా ఉన్నారా? వారినీ లోపలకు రమ్మను'' ఆహ్వానించాడు రాఘవరావు.

''మరెవరూ లేరండి. నేనే! నే నొక్కర్తినే!''

''అలాగా! వచ్చి లోపల కూర్చో, అమ్మా! ఫరవాలేదు. ఆ బ్యాగు టేబిలు మీద పెట్టు. అద్దదీ. చెప్పాను కదమ్మా మాది చిన్నస్టేషనని? మాకూ ప్రయాణికుల వెయిటింగ్ రూముంటుంది. కాని ఎవరికీ ఉపయోగ యోగ్యం కాదు. ఈ స్టేషనుకు కరెంటు లేదు. చమురు దీపాలే గతి. ఇద్దరు పాసెంజర్లు ట్రెయిన్ ఎక్కితే, ఒకడు ట్రెయిన్ దిగుతాడు. అందుకనే ఈ స్టేషన్ను ఎత్తేద్దామనుకున్నారా మధ్య. కాని, 'మేం మెయిలు ట్రెయిన్నే ఆపించాలని చూస్తుంటే స్టేషనే ఎత్తేస్తారా?' అంటూ పెద్దలెవరో అడ్డు తగిలారు. ఇది ఇలా నిలబడింది...''

ఫోన్ రింగైంది.

రాఘవరావు మెసేజ్ అందుకుని స్లాట్ ఇచ్చి, కాబిన్‌కు ఫోన్ చేస్తూ, ''కోనారీ'' అంటూ కేకేశాడు.

''బాబూ!'' గోడ పక్కన బీడీ కాల్చుకుంటూ కూర్చున్న కోనారి బీడీని గోడ పక్క దాచుకుంటూ పలికాడు.

''అవుట్ కొట్టు పాసెంజరుకి''.

కోనారి పరుగెత్తాడు.

''పాసెంజరా?'' ఆత్రతగా అడిగిందామె.

''మీ పాసెంజరు కాదమ్మా. ఇది పూరీ వెళ్లే పాసెంజరు. మీ బండికింకా చాలా వ్యవధి ఉంది. కాని, నాతో కూర్చుంటే గంటలయినా నిమిషాల్లాగ గడిచిపోతాయి. నా ఎదురుగా మనిషి ఉంటే మాటాడకుండా ఊరుకోలేను. కానీ, అమ్మాయి! ఒక ప్రశ్న. నిన్ను చూచిన దగ్గర్నుండి ఎక్కడో చూశాననే అనిపిస్తోంది. కాని, ఎక్కడ చూశానో గుర్తు రావటం లేదు. ముఖం మాత్రం పరిచయమున్న ముఖంలాగే ఉంది. మీది ఏ ఊరు?''

కొద్దిసేపు ఆలోచించి అందామె. ''పక్క ఊరేనండి''.

''అంటే?''

''దగ్గరి ఊరే లెండి?''

''ఆ ఊరికి పేరు లేదా?''

తల దించుకుని కొద్దిసేపాగి, ''కృష్ణాపుర మండి'' అంది.

''కృష్ణాపురమా? ఇక్కడి నుండి మూడు మైళ్ల దూరంలో ఈ ఊరున్నదని వినటమే గాని, నేనెప్పుడూ అక్కడికి పోలేదు. ఇంతకూ ఎవరమ్మాయివి?'' అడిగాడు.

''బాబూ! పాసెంజరు బండికి టిక్కెట్టిస్తావా?''

రాఘవరావు తాళం గుత్తి అందుకుని టిక్కెట్ ట్యూబ్ దగ్గరికి నడిచాడు.

''రెండు పెద్ద టిక్కట్లిచ్చీ, బాబూ! ఒక సిన్న టిక్కట ఇచ్చీ! మా ఆడదాయికి కూడా ఇచ్చీ, బాబూ! బాబూ! మా కడదానికి కూడా లాక్కుంతవా టిక్కటి?''

''ఇంతకీ ఏ ఊరోయి?''

''మాదా! ఎరికనేదా, బాబూ! మాది లచ్చింపేట. దగ్గిరే. సేపలమ్మే వోణ్ణి. బాబూ! దశరథుడు నా పేరు'' విడమరిచాడు.

''మీ ఊరూ, నీ పేరూ కాదోయ్! నీవు ఏ ఊరెళతావు? అది చెప్పు''.

''బాబూ! సెప్పినాను. సిమ్మాసెలం. ముంగలే సెప్పినాను, బాబూ! నీ వినుకోనేదు''.

''ఆ ట్రెయిన్‌కి ఇంకా టయిముందోయ్''

''ఇచ్చీ, బాబూ మల్లా బండొస్తే అల్లు!''

ఫోన్ రింగైంది. కోనారి ఫోన్ అందుకున్నాడు. పాసెంజరు హోమ్ సిగ్నల్ పాసయింది. కోనారి సైట్ కొట్టాడు.

రాఘవరావు పాసెంజరుకి టిక్కెట్లిచ్చి, కోటు తొడుక్కుని ప్లాట్‌ఫారం మీదికి కదిలాడు. కోనారి అతని వెనక హాండ్ సిగ్నల్ సరిచేసుకుని కదిలాడు. ప్లాట్‌ఫారం మీద బుషి పక్షులు తాము దాగున్న స్థలాల నుండి చెదిరిపోయాయి. ట్రెయిన్ లోంచి ముచ్చటగా ముగ్గురే దిగారు. ఒకడు మాత్రమే రాఘవరావు దృష్టికందాడు. పట్టాలు దాటి అవతలికి పోయినవాడు, ఫెన్సింగ్‌లోంచి సందుచేసుకొని పోయినవాడు రాఘవరావు దృష్టికందలేదు.

కోనారి గంట కొట్టాడు. రాఘవరావు పచ్చదీపం చూపాడు.

ట్రెయిన్ కదిలింది.

తలమీద, ముఖం మీద కళ్లద్దాల మీద పడ్డ వర్షపు చినుకులను రుమాలుతో తుడుచుకుంటూ, తన సీటు ముందుకు చేరబోతున్న రాఘవరావు తెల్లబోయాడు.

టేబిల్ మీద బాగులేదు. బల్ల మీద అమ్మాయి లేదు.

''కోనారీ!'' కేకేశాడు రాఘవరావు, టైమ్ రిజిస్టరుని ముందుకు లాక్కుంటూ.

''బాబూ!'' సమాధానమిచ్చాడు కోనారి.

''ఇక్కడ – ఈ గదిలో ఇప్పుడొక అమ్మాయి కూర్చుని ఉండాలి. ఏదీ?''

''ఏమో, బాబూ! నాను సూళ్లేదు''.

''పాసెంజరు బండి అన్నానని కొంపతీసి ఈ బండిగాని ఎక్కేయలేదు కదా?''

''ఆ అమ్మాయి అంత తెలివి తక్కువదా యంటారా, బాబూ!'' సందేహం వెలి బుచ్చాడు కోనారి.

''కాదులే! కాని, రోజులూ కూడా బాగులేవు. చూడు. నీవు ప్లాట్‌ఫారం మీద కాబిన్‌వైపు చూడు. నేను ఇటుపక్క చూస్తాను! అమ్మాయి ఒంటిమీదా నగానట్రా ఉంది. ఒంటరిగా ఉందని.... నమ్మలేని రోజులివి. ఇలాంటి వార్తలు పేపర్లో మనం ఎన్ని చదవటం లేదు? నీవటు పరుగెత్తు'' పెన్ను ముడిచి స్లాట్ వెనక్కి తోశాడు.

కోనారి కాబిన్‌వైపు పరుగెత్తాడు. రాఘవరావు రెండవ దిశకు పరుగెత్తాడు. పాసెంజరు అవుటర్ సిగ్నల్ పాసయింది. ఉత్తరంగా, దక్షిణంగా ఉన్న రెడ్ సిగ్నల్స్ ఎత్తు నుండి కళ్లు చించుకుని చీకటిలోంచి చూస్తున్నాయి. దూరాన వంపుతిరిగిన నదిమీది వంతెన చీకటిలో కనిపించటం లేదు. కాని, ఆ వంతె నను రాఘవరావు గుర్తుపట్ట గలడు. జల్లుగా వాన పడుతూంది. లాంపు పోస్టులమీద దీపాలు ఆరిపో యాయి. ప్లాట్‌ఫారం మీద చీకటి ముద్ద కట్టుకుని ఉంది. ముందుకు కదులుతున్న రాఘవరావు ఆగాడు. తురాయి చెట్టు క్రింద సిమ్మెంటు బల్ల మీద ఏదో ఆకారం. తలమీద నుండి ముసుగు. రాఘవరావు గుర్తుపట్టాడు.

''అమ్మాయీ! అమ్మాయీ! ఇక్కడున్నావా? నీ కోసం స్టేషనంతా గాలించేస్తున్నాము. అది సరే. అక్కడంత జాగా ఉండగా, ఇక్కడ ఈ చీకటిలో, ఈ వానలో, ఈ చలిగాలిలో కూర్చున్నావేమమ్మా? నేనేమైనా అవతలికి పొమ్మన్నానా? పద, పద''.

గాలి కదిలింది. చెట్టుమీది నుండి వర్షపు బిందువులు జల జల రాలాయి. ఒంటిమీద పడ్డ వర్షపు బిందువులు తుడుచు కుంటూ నిలుచున్నదామె.

''పదమ్మా, పద''

''నన్నిక్కడే ఉండనివ్వండి, మాస్టారూ! నాకిక్కడే బాగుంది. నాకు మాత్రం సామర్లకోటకు టిక్క ట్టివ్వండి. ఇదిగో డబ్బు'' పర్సు తెరుస్తూ అందామె.

''నేను టిక్కటివ్వకపోను, ట్రెయినూ రాకనూ పోదూ, నీవు వెళ్లక ఆగిపోవూ. తండ్రి లాంటి వాడిని నేనుండగా ఈ చీకటిలో, ఈ వర్షంలో... అందులో ఒంటరిగా... పైగా చీకటి మంచిది కాదమ్మా! ఒంటిమీద కాస్తోకూస్తో బంగారముంది. కష్టాలు కోరి తెచ్చుకోకు... అసలు ఆడవాళ్లు ఒంటరిగా ప్రయాణం చేయకూడదు. పైగా ఇలాంటి వాతావరణంలో వచ్చి హాయిగా విశ్రాంతి తీసుకో. మరాలోచించకు''.

''వద్దులెండి, మాస్టారూ! నన్ను ఒంటరిగా ఉండనివ్వండి''

''అర్థమవుతోంది. నీ మనసు బాగాలేదు. ఇంకో మాట. నీ మనసును నేనే మైనా బాధ పెట్టానా?''


''లేదండి''

''మరి ఎందుకమ్మా సంశయం!''

''నాకొక మాట ఇవ్వగలరా? మాట ఇస్తే వస్తాను''

''అడుగు''

''నే నెవరినో నన్నడగద్దు. అసలు నా గురించి మీరేమీ అడగకూడదు. నా గురించి ఎవరేమడిగినా చెప్పకూడదు. మీరు మాట ఇస్తేనే వస్తాను. లేకపోతే ఇక్కడే ఉంటాను. చెప్పండి. నాకు ప్రామిస్ చేయగలరా?'' దీనంగా చూచిందామె.



నాటకాలు చూశాడు రాఘవరావు. నాటకాలెన్నో ఆడాడు. కాని, ప్రస్తుత సన్నివేశం మాత్రం అతనికి వింతగా ఉంది. ఆమె మనసులో ఏదో రహస్యముంది. రాఘవరావు ఆమె వైపు చూశాడు. చీకటిలో ఆమె కళ్లు మెరుస్తున్నాయి. తెల్లని సాదాచీర కురిసి పోగు పడ్డ మంచులా ఉంది. ముఖంలో భావాలు అతనికా చీకటిలో వ్యక్తం కావటం లేదు. స్టేషను అవతల మామిడి చెట్టు క్రింద రంగసామి జట్కా గుర్రం సకిలించింది. ఎడమ చేతితో నుదుటి మీద ఒకసారి రుద్దుకున్నాడు. కుడిచేత్తో ముఖం తుడుచు కుంటూ, ''అయితే, నీ గురించి అడగటానికెవరైనా వస్తారంటావా?'' అని అడిగాడు.

తల ఎత్తి, ''వస్తే రావచ్చు'' అంది.

''నేను నీకు మాట ఇవ్వకపోతే ఈ రాత్రి నీవిక్కడే ఉంటావు కదూ? నీ గురించి ఎవరడిగినా చెప్పే అవకాశం నాకుంది కదూ?'' అడిగాడు.

తెల్లబోయిందామె.

''నీవు ఏ కారణం చేత ఇలా ప్రవర్తిస్తున్నావో నాకనవసరం. కాని, ఇది నా స్టేషను. నేను స్టేషన్ మాస్టర్నే కాని, పోలీసు వాడిని కాను. నీవు ఒంటరిదానివి.

అజాగ్రత్తగా ఉన్న నిన్ను రక్షించే బాధ్యత నామీదుంది. ట్రెయినెక్కిన తరవాత నీకేం ప్రమాదం జరిగినా నేను చూడలేను, రక్షించలేను'' అన్నాడు.

ఆమె మాటలు లేనిదైంది.

''ఉన్నమాట అన్నాను కదూ? అవి కొద్దిగా పరుషంగానే ఉంటాయి. అయినా, చెప్పక తప్పదు. చెప్పాను. నిన్నుచూస్తే నాకెవరో జ్ఞాపకమొస్తున్నారని అన్నాను కదూ? అందుచేత నీ మీద జాలి కలుగుతోంది. నీకు సహాయం చేయాలనిపిస్తున్నది. నీ గురించి ఎవరేమడిగినా చెప్పను. నిన్నేమీ ప్రశ్నలు వెయ్యను. సరా? ఇకనైనా వ్రతం చాలిస్తావా?''

ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి. రెండుచేతులు జోడించి, ''థాంక్స్'' అంది. రాఘవరావు వెనుదిరగబోయాడు. ఆమె ముందుకు అడుగెయ్యబోయి, ''మాస్టారూ! ఒక్క మాట'' అంది.

ఏమిటన్నట్టు చూశాడు రాఘవరావు.

''నన్నక్కడ ఎవరైనా చూచే అవకాశముంది కదూ?'' అంది.

''ఆ ప్రశ్న రాదు. నాకుతప్ప మరి ఎవ్వరికీ కనిపించని విధంగా నిన్ను దాస్తాను. ట్రెయిన్ రాగానే ట్రెయినెక్కించి పంపిస్తాను. ఇంకా ఏమైనా సంశయాలా?'' అడిగాడు.

ఏమీ లేవన్నట్లు తల ఊపి, అతనిననుసరించిందామె. రూములోకి చేరుతూనే తల తుడుచుకోవటానికి తువ్వాలిచ్చాడు. చేతులు, ముఖం, తల తుడుచుకొని తువ్వాలు ఒక పక్కగా ఆరవేసింది. హరికేన్ దీపాన్ని స్లాట్ బాక్సుకు దూరంగా జరిపాడు. అవతల బల్లమీద, చీకటిలో కూర్చుందామె. ఫోన్ రింగైంది. రాఘవరావు మెసేజ్ రిసీవ్ చేసుకుని, కాబిన్‌కు ఫోన్ చేసి, గూడ్సు ట్రెయినుకు స్లాట్ ఇచ్చాడు.

ఫ్లాస్కు తెరిచి రెండు కప్పుల కాఫీని సర్ది ఆమెకొక కప్పు ఇచ్చాడు.

''ఎతికినాను, బాబూ! ఆయమ్మ ఏడా కన్పడ్లేదు'' కోనారి వస్తూ అన్నాడు.

''సర్లే! ఈయమ్మ ఇక్కడే ఉంది. అప్ గూడ్సు ట్రెయిన్ వస్తోంది. నీవు అవతల ఉండు''.

''అనాగే, బాబూ!'' కప్పులు రెండింటిని పట్టుకుని అవతలికి వెళ్లిపోయాడు కోనారి. అతను కప్పులు యథాస్థానంలో ఉంచి అవతలికి వెళ్లిపోయేంతవరకూ మాటాడలేదు రాఘవరావు. అతను వెళ్లిన తరవాత నెమ్మదిగా ముందుకు వంగి, ''నీవు ఎవరికీ తెలియనివ్వని విషయం ఒకటుంది. అది నాకూ తెలియదు. కాని, తెలిసినంత మాత్రమైనా ఎవరికీ చెప్పనివ్వకుండా మాట తీసుకున్నావు. మరి నిన్ను నేను దాచేటప్పుడు నీవు నానుండి రహస్యాన్ని దాచటమెందుకు?'' అన్నాడు.

ఆమె తలఎత్తి అతని మాటలు పూర్తిగా విని, ''రహస్యాలలో కొన్నింటిని చెప్పవచ్చు. కొన్నింటిని చెప్పకూడదు. అలాగే కొన్ని చెప్పగలిగేవి ఉంటాయి. చెప్పలేనివి కొన్నుంటాయి. మరి నేనేం చెప్పేది?'' అంది అతని ముఖంలోకి చూసి.

''అంత చెప్పకూడనిదా?'' ఆమె కళ్లలోకి చూశాడు. పరీక్షలో ఆమె నెగ్గింది. ఆమె కనులను దించుకోలేదు. ''ఆc!'' అని మాత్రం అంది. తృప్తిగా ఊపిరి తీశాడతను.

''నిన్ను ఏ ప్రశ్నా అడగనన్న మాట ఇచ్చాను. కాని, ఒక ప్రశ్న అడగక తప్పదు. నన్ను జాలితో బంధించావు. కాని, నీ గురించి తెలిసిన వ్యక్తి మరొకరున్నారు. నీవు జట్కాలో వచ్చి ఉంటే జట్కావాలా! ఎవరి జట్కాలో వచ్చావో చెప్పు. ముందు మనం వాడిని కట్టడి చేయాలి''.

''ఆ జట్కా వాడికి నా గురించి తెలుసును. అతను ఎవరికీ ఏమీ చెప్పడు. ఆ హామీ ఉండబట్టే వచ్చాను ఈ రాత్రి''.

''చాలామంచి పని చేశావు. నీ పరంగా నీవు జాగ్రత్త పడ్డావు. మరి నా జాగ్రత్తనే పడవద్దూ? నిన్ను ఇక్కడనే దాచినందుకైనా వాడితో నే మాట్లాడాలి. నే చేసేది ప్రభుత్వ ఉద్యోగమే. కాని, ప్రభుత్వం మాత్రం ప్రజలది. నా జాగ్రత్త నే పడాలి. ఎవరా జట్కావాడు? రంగసామా?''

''అవును. రంగసామే''

''నే వాడిని కలిసి వస్తాను. అవసరమైతే కొంత డబ్బు ముట్టచెబుతాను'' త్వరగా అవతలికి వెళ్లిపోయాడు రాఘవరావు.

ఆమె గదిచుట్టూ గోడల మీద వ్రేలాడుతున్న రిజిస్టర్లను చూస్తూ కూర్చుంది. అయిదు నిమిషాలలో వచ్చాడు రాఘవరావు. వస్తూ అన్నాడు: ''నీ జట్కాలో గాని అమ్మాయి వచ్చినట్టు ఎవరికైనా తెలిస్తే ఊరి వాళ్లు నీ ప్రాణాలు దక్కనివ్వరు. మరి నీ ఇష్టం – అని అన్నాను, అది చాలదూ?''

'చాలు' అన్నట్టు తల ఊపిందామె.

''కాని, ఊరు మాత్రం వాడిని ప్రాణాలతో వదలదు. స్టేషనుకు వచ్చేవి మూడే మూడు జట్కాలు. మిగతా ఇద్దరూ అతనిని అనుమానించక తప్పదు. నేరం ఒప్పుకోక తప్పదు. నీవేమో డబ్బున్న వారి పిల్లలా కనిపిస్తున్నావు. వాడికేమయితే నేం? నీ దారి నీది'' అన్నాడు రాఘవరావు.

ఆమె అతనివైపు పరీక్షగా చూచి తల దించుకుంది.

రాఘవరావు దీపాన్ని కొద్దిగా పెద్దది చేశాడు. ఆమెకు దగ్గరగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. దీపం వెలుగు పూర్తిగా అతనిమీద పడుతూంది. కళ్లద్దాలు ఒకసారి తుడుచుకుని, గొంతు సరిచేసుకుని అన్నాడు.

''కొందర్ని చూస్తే కొందరు జ్ఞాపకమొస్తారు. కొన్ని పరిస్థితులు చూస్తోంటే గతించిన కొన్ని పరిస్థితులు గుర్తుకొస్తాయి. చెప్పానుగా – నిన్ను చూస్తే నాకెవరో గుర్తుకొస్తున్నారని? వారెవరో ఇదమిత్థంగా నే చెప్పలేను. కాని, ఈ రోజున, ఈ వేళలో, ఈ వాతావరణాన్ని చూస్తుంటే పది సంవత్సరాల క్రితం జరిగిపోయిన సంఘటన గుర్తుకొస్తున్నది. ఆ సంఘటన ఏమిటో తెలుసా?....''

టేబిల్‌మీద ఫోన్ రింగైంది. కాబిన్ నుండి ఫోన్. గూడ్సు బండి రాక అది. కోనారి హేండ్ సిగ్నల్ చేత పట్టుకుని లైన్ల అవతలికి వెళ్లాడు. రాఘవరావు ప్లాట్‌ఫారం మీదికి వెళ్లే సరికి స్టేషనులోకి ప్రవేశించింది గూడ్సు. గూడ్సు పాసయింది. రాఘవరావు టైమ్ రిజిస్టరులో – టైమ్ నోట్ చేసేంతవరకూ ఆగి, అతని ముఖంవైపు చూచిందామె. రాఘవరావు తల ఎత్తి, ''ఆ రోజు... అంటే అక్టోబరు... పన్నెండో తారీకునాడు... ఆ రోజు కూడా ఈ రోజులాగే వర్షం పడుతోంది. రాత్రి వేళ, చలితో కూడిన గాలి. ఆ గాలిలో, ఆ వానలో... ఆ గాలివానలో... నీలాగే వయసులో ఉన్న అమ్మాయి, పరువంలో ఉన్న కుర్రవాడు పాసెంజరు ట్రెయిను కోసం వచ్చారు. ఇక్కడికి కాదు. ఈ స్టేషన్‌కి కాదు! ఈ వూరికి కూడ కాదు! అప్పుడు నేను స్టేషను మాస్టర్ని కాను. అప్పుడు నాదొక చిన్న ఉద్యోగం. కుటుంబం మాత్రం చిన్నదేం కాదు. ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు, నేను, నా భార్య. ఆ రోజు రాత్రి ఒంటి గంటప్పుడు ఒక జంట రావడం స్టేషను మాస్టరు చూశాడు. ఆమె ఆ రోజు నల్లని చీర, నల్లని జాకెట్టు ధరించింది. ఆమెది తెల్లని శరీరం. ఆ రంగుకు నలుపు అందాన్నిస్తుందనే ఆమె భావన. కాని నీకు తెలుసో, తెలియదో – నలుపు అశుభాన్ని సూచిస్తుందంటారు... అది అలానే జరిగింది. స్టేషను మాస్టరు వారిద్దర్నీ చూశాడు. ఆమెను మాత్రం ఎప్పుడో, ఎక్కడో చూచినట్టు అతనికి గుర్తు. కాని, అతనిని చూచిన గుర్తులేదతనికి. ఆ రాత్రివేళ ప్రయాణిస్తున్న వారిని అతను అనుమానించలేదు. వారిద్దరూ భార్యాభర్తలు ఎందుకు కాకూడదు? అన్నా చెల్లీ ఎందుకు కాకూడదు? అని అతననుకున్నాడే గాని, వారి ముఖాలలో ఆందోళనను అతను కనిపెట్టలేదు. వారు ఎవరికి కనిపించకుండా చీకటివైపు పారిపోవటాన్ని

## ..అలాంటి జీవితాలను సరిదిద్దడం కోసం



నిజానికి ఈ కథ, ప్రియుడికోసం ఇంటి నుండి పారిపోయిన ఒక దీనురాలి వ్యథ. పదిహేను రోజుల తరవాత దుఃఖంతో తిరిగి వచ్చిన ఆమెను తల్లిదండ్రులు ఆదరించగలిగారే గానీ ఆమె జీవితాన్ని సరిదిద్దలేకపోయారు. నేను 'మందసా'లో ఉన్నప్పుడు ఆమె వాస్తవగాథ విని చాలా కలత చెందాను. ''ఆనాడే, ఆ చీకటి రాత్రే, ఎవరైనా ఆమెకు నాలుగు మంచి మాటలు చెప్పి ఇంటికి తీసుకు వచ్చి ఉంటే ఆమె జీవితంలో అది కాళరాత్రి కాకపోయేది కదా! ఆమె బతుకు తెల్లారిపోకుండా ఉండేది కదా!'' అనిపించింది. తనలా ఎవరూ మోసపోకూడదనీ, ఆ విషయం అక్షర బద్ధం చేసి పదిమందికి చెప్పాలనిపించింది. అందుకే, ఆమె కథకు ఆసరాగా ఓ ప్రేమ కథను అల్లి, గుండె ఝల్లుమనే ముగింపునిచ్చాను. ఇన్నేళ్లయినా, కథా కాల ప్రవాహంలో కొట్టుకు పోకుండా నిలబడ్డ ఆ 'వంతెన' ఇంకా మంచి కథలు రాయగలనన్న ఆత్మవిశ్వాసం నాలో పెంచింది.

**–జయంతి వెంకటరమణ**
*1-115/3, నాగయ్య లే అవుట్, గణేశ్‌నగర్,*
*చినముషిడివాడ, సుజాతనగర్ పోస్ట్*
*విశాఖపట్నం – 530 031*
*ఫోన్: 0891-2764940*

అతను తప్పు పట్టలేదు. రైలు రాకకోసం వారు చూపే ఆత్రుతను అతను ఉత్సాహంగానే తీసుకున్నాడు. ఆమె మెడలో పసుపుతాడు లేదు. అతను మాత్రం 'డార్లింగ్' అంటున్నాడామెను. వాటిని అతను పసిగట్టలేదు. కారణం – అతను లోకానుభవం లేనివాడు. లోకం పోకడలు అతని కంత తెలియవు. మర్నాడు మాత్రం సింహావలోకనం చేస్తూ తను వారినెందుకూ అనుమానించలేక పోయాడా అని ఆమె తండ్రి ముందు తన్ను నిందించుకున్నాడు. అతనేగాని ఏ మాత్రం తెలివిగా అయినా వ్యవహరించి ఉంటే, "నీ వెవరు? ఆమె ఎవరు?" అని నిలదీసి ఉంటే... ఆ అమ్మాయి ఇప్పుడీ స్థితిలో ఉండకపోవును. నందనవనంలా ఉన్న ఆ కుటుంబం నాశనం కాక నిలిచి ఉండేది... ఆమె తండ్రి ఒక పల్లెటూరిలో తలదాచుకుని కుమిలిపోనవసరం ఉండేది కాదు.." రాఘవరావు ఆగి ఒకసారి కుర్చీలో వెనకకు చేరగిలపడి కళ్లను గట్టిగా మూసుకుని, ముందుకు వంగి కళ్లాద్దాలు తీసి రిజిస్టరు మీదుంచి కనుకొలకులు కుడిచేతి చూపుడు వేలితో తుడుచుకుని ఆమె వంక చూశాడు. ఆమె కొద్దిగా ముందుకు వంగి భ్రుకుటి ముడిచింది. అతని గొంతు క్షణక్షణానికి వింతగా మారిపోతూంది.

"ఎప్పటిలాగే ఆరోజు కూడా ట్రెయిను వచ్చింది. వాళ్లూ ట్రెయినెక్కి వెళ్లిపోయారు. ట్రెయిను స్టేషనును వదిలిపెడుతూ వేసిన కేకను, మగత నిద్రలో ఆమె తండ్రి విన్నాడు. కాని, ఆ కేక అర్థం అతనికి తెలియలేదు. 'నీ కూతురు లేచిపోతూందిరోయి' అన్నదా కేక. మర్నాటి ఉదయం టేబిల్ మీద ఉత్తరాన్ని చూచాడా తండ్రి. నిలువున నీరైపోయాడు. ఆ ఉత్తరంలో ఆమె ఇలా వ్రాసింది. కళ్లు మూసుకుని కుడిచేతి చూపుడు వేలితో నిలువుగా ఒకటి రెండు సార్లు రుద్దుకుని అన్నాడు రాఘవరావు.

"నాన్నా!'

నేనూ, రమేష్ వెళ్లిపోతున్నాం. మా పెళ్లికి నీ విష్టపడవని మాకు తెలుసు. నా గురించి వెతకవద్దు. సెలవు' ఇదీ ఆ ఉత్తరం. ఉత్తరాన్ని తండ్రి చదివాడు. అందరూ విన్నారు. ఉత్తరంలో విషయాన్ని తెలుసుకున్న ఆమె తల్లి, గుండె జబ్బుతో బాధ పడుతున్న అతని భార్య, మనసుకు తగిలిన దెబ్బకు తట్టుకోలేక ఆ రోజు మధ్యాహ్నామే మరణించింది. ఆ రోజు అక్టోబరు పదమూడు..." రాఘవరావు కొద్దిసేపాగి టేబిల్ మీద చేతులాన్చి మళ్లీ ప్రారంభించాడు.

"భార్యపోయిన బాధతో క్రుంగిపోతూనే కూతురు కోసం ప్రయత్నాలు చేశాడు. అతనికి తెలుసు, ఆమె చాలా అమాయకురాలని. అందుకనే ఏనాటికైనా ఆమెను ఇంటికి తేవాలని ప్రయత్నాలు చేశాడు. రైల్వేస్టేషను ఇచ్చిన సమాచారాన్ని అందుకుని బయలుదేరాడు. కాని, ఎక్కడని వెతగ్గలడు? ఎంతకాలమని వెతగ్గలడు? నిజానికి వాళ్లు టిక్కట్లు తీసుకున్నదొక ఊరికి. వెళ్లింది మరోచోటికి. వెతికి వేసారి పిచ్చివాడై తిరిగి వచ్చాడామె తండ్రి. ఇక ఆ ఊరిలో ఉండలేక బదిలీ పెట్టుకుని ఆ ఊరు వదిలి వచ్చాడు. ఆ రోజు నవంబరు ఏడవ తారీకు. ఇప్పటికైనా అతనికి శాంతి లభించిందా? లేదు. ఆమె వేసిన తప్పటడుగుకి ప్రతిఫలాన్ని ఇప్పటికీ అతను రుచి చూస్తూనే ఉన్నాడు. కొరడా దెబ్బలు తింటూనే ఉన్నాడు. ఇదీ ఆ తండ్రి కథ. ఇదీ ఆ అభాగ్యుడి కథ" కళ్ళలో చేరిన కన్నీటిని నిగ్రహించుకునే ప్రయత్నం చేస్తూ తలను క్రిందికి దించుకున్నాడు.

ఆమె మాటలు లేనిదైంది.

"నేను చెప్పిన ఈ సంఘటనతో నీ మనసు పాడైంది కదూ? కాని, నిన్ను బాధ పెట్టాలని నే నీ విషయాన్ని నీకు చెప్పలేదమ్మా! ఇంతకుపూర్వం ఈ కథను నేను ఎవరికీ చెప్పలేదు. కాని, ఈ రోజున ఈ గాలీ వానను చూస్తోంటే చెప్పాలనిపించింది, చెప్పాను. ఆమె కూడా నీలాగే అందంగా, ఆరోగ్యంగా, అమాయకంగా ఉండేది. నిన్ను చూస్తే ఆమె నాకు గుర్తు రాలేదు. ఈ రోజు వాతావరణం గుర్తుకు తెచ్చింది ఆమెను" చెపుతూ తల ఎత్తాడు.

అతను తల ఎత్తగానే – "ఇంత వివరంగా ఇన్ని విషయాలు చెపుతున్నారు. మీకు ఆమె తెలుసా? ఆ కుటుంబం మీకు బాగా తెలుసా?" అని అడిగింది.

తలను ఒక పక్కగా వంచి అదోమాదిరిగా వైరాగ్యంతో కూడిన నవ్వు నవ్వి, "ఆమె ఎవరో అయితే నాకీ బాధ ఎందుకమ్మా? ఈ కన్నీరెందుకు? ఆమె ఎవరో కాదు. నర్మద. నర్మద నా కూతురు. ఆ దౌర్భాగ్యుణ్ణి నేనేనమ్మా!" అన్నాడు.

రాఘవరావు కంటి వెంట రెండు కన్నీటి బిందువులు రాలి పడ్డాయి.

"నర్మద పడుతున్న బాధలను కళ్లారా చూస్తూ, నరకాన్ని అనుభవిస్తున్న ఆ తండ్రిని నేనేనమ్మా!" అన్నాడు రాఘవరావు ఆమె వంక తిరిగి.

"అయ్యయ్యో! ఎంత బాధాకరమ్మైన విషయం! ఇంతకూ ఆమె ఏమ్మైంది? అతనేమ్మైనాడు? వాళ్లు కులాసాగా లేరా?" చెమర్చిన కళ్లతో అడిగిందామె.

"అవును. అడగవలసిన విషయమే అది. రమేష్, నర్మద కులాసాగా ఉండి ఉంటే ఇంత బాధ నాకెందుకు? కొంతలో కొంత తృప్తి అని సర్దుకునేవాడిని. కాని, అలా జరగలేదు.... అసలేం జరిగిందంటే... అసలు..." రాఘవరావుకు మాటలు రాలేదు. తలవంచుకున్న వాడల్లా కుర్చీలోంచి లేచి కంటిబిందువులు తుడుచుకుని గంభీరంగా ఉండటానికి ప్రయత్నిస్తూ గదిలో రెండు మూడుసార్లు పచార్లు చేశాడు. గుమ్మం దగ్గరిరెళ్లి, "కోనారీ!" అంటూ కేకేశాడు. మూడో పిలుపుకి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"మూర్తిగారు రాలేదా?" అని రాఘవరావు అడుగుతూండగానే ఎ.ఎస్.ఎం.మూర్తి వచ్చాడు. అతనికి ఛార్జి అప్పగించి, "పదమ్మా! ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుందాం. అక్కడే మాట్లాడుకోవచ్చు" అంటూ ఆమెను తీసుకుని బయలుదేరాడు. ఇంటి తాళం తీస్తోంటే – "మీరు ఒక్కరే ఉంటున్నారా, బాబుగారూ!" అని అడిగిందామె.

"ఒంటరిగా ఉండమని దేవుడు శాసించిన తరువాత తప్పుతుందా, అమ్మా?"

ఆమె సమాధానమీయలేకపోయింది. దీపం వెలిగించి, ఆమె కూర్చోటానికి కుర్చీ చూపి స్టవ్ వెలిగించి, నీళ్లు పెట్టాడు. స్టవ్‌ముందు గొంతుకిళ్లా కూర్చుంటూ, "అసలు

కవిత

## స్వేచ్ఛాపావురం..



ఆదివారం
అద్దంమీ్మద ఎర్రెర్రని పురుగులా జారిపోతున్న
సూర్యుడిని తుడిపేస్తూ
కిటికి తలుపుల్ని బంధించి
సుఖంగా కమ్మటి స్వేచ్ఛారాగాన్ని
మంచంమీద పరుచుకొని నిద్రపోతున్న జీవి

కండ్లకు గంతలు కట్టుకొని
పేపర్ ఒక్కొక్క పేజీని తిప్పుకుంటూ
ఏ ఆటల పేజీలోనో, సినిమా పేజీలోనో తలదూర్చి
నడవడం కొత్త కాదు

ఆఫీసు టేబుళ్ళమీద
ఇన్ని రోజుల ఆవులింతల అర్థం ఆదివారమ్మైనప్పుడు
చెవుల్లోకి బాధల సీసాన్ని పోసినా సోయి ఉండదు

రిమోట్ మీద వేలిముద్రల సాక్షిగా
శరీరాన్ని, మనసును టీవికి అతికించి
భక్తి మంత్రం పఠిస్తూ పొద్దుపుచ్చడం ఒక తంతు
కొయ్యకు తలిగించిన అంగీ జేబులనుంచి
ఒక కరపత్రం తలెత్తుకొని చూసిచూసి
అలసిపోయిన సందర్భంలో
అన్నింటిని వాషింగ్ మిషన్‌లో వేసి
ఆలోచనల్ని ముక్కలు ముక్కలు చేసే
మనిషి తత్వం

ఆదివారం నుంచి
నోట్లో అబద్ధాల లాలాజలం ఊరుతనే వుంటుంది
కాళ్ళను గొలుసులతో కట్టేసుకొని
మనసును పగ్గంతో బంధించుకొని కూర్చుంటే
గోడకు దిగేసిన ఫొటో ఫ్రేంలా ఉండిపోదు కదా
కాలం

అసలైన స్వేచ్ఛకు అర్థం సరిగ్గా ఆరోజే
పావురాల రెక్కలు తొడుక్కొని
ఆకాశంలోంచి నేలపైకే
నేలమీంచి ఆకాశంలోకి
విహరించడమే అసలైన మనిషితనం

– వేముగంటి మురళీకృష్ణ

నర్మద చాలా మంచిపిల్ల, అమ్మలూ! నా మాటనెప్పుడూ కాదని ఎరగదు. కాని, అలాంటి నర్మద నన్ను మోసం చేసి, తన్ను మోసం చేసుకుంటుందనుకోలేదు. ఈ దౌర్భాగ్య పరిస్థితిని తెచ్చుకుంటుందనుకోలేదు'' అంటూ ఆగాడు రాఘవరావు.

స్టవ్ నీలిమంటలు అతని ముఖం మీద పడి అతనిముఖం మీది విషాదాన్ని మరీ నీలంగా చూపిస్తున్నాయి. ఆ స్టవ్ ధ్వనిలో అతడు విడిచిన నిట్టూర్పులు ఆమెకు వినిపించలేదు.

''నేనప్పుడు చేసేది చిన్న ఉద్యోగమయినా, కుటుంబం పెద్దదయినా నర్మద పెళ్లి ఘనంగా చేయాలని అన్ని ఏర్పాట్లుచేశాను. అయిదు వేల కట్నంతో సంబంధం స్థిర పరిచాను. నర్మదకు అన్నీ తెలుసు. కానీ నర్మద తప్పటడుగు వేసింది. ఆనాడు నర్మదే గాని ఆ పొరపాటు చేయకుండా ఉండి ఉంటే ఈనాడు మంచి హోదాగల డాక్టరు భార్యగా పిల్ల, పాపలతో సుఖపడేది. వాళ్లమ్మ నాకు బదులుగా కాఫీని తానే ఇవ్వ గలిగేది. వాళ్ళ చెల్లెలు శాంత అత్తవారింటిలో బాధలు పడేది కాదు. నాకీ ఒంటరి జీవితం తప్పేది. కాని, నర్మద ఆలోచించ కుండా అడుగువేసింది... అనుభవిస్తున్నది.'' కాఫీని కలిపి ఆమెకొక కప్పు ఇస్తూ, ''ఈ ఉద్యోగంలోకి చేరిన తరవాత కాఫీ, టీలు తాగటం ఎక్కువై పోయిందమ్మా. నీవు కొద్దిగా తీసుకో'' అన్నాడు.

''మీరింత బాధపడుతూ చేయటం, ఆ కాఫీని నేను తాగటం – బాధగా ఉంది, బాబుగారూ!''

''బాధ! అవును. నిజంగా బాధే. వింటున్న నీకే బాధగా ఉంటే అనుభవిస్తున్న వాళ్లకెలా ఉండాలి? కాని, నర్మద చరిత్ర ఇలా దాగిపోకూడదు. దేశ వ్యాప్తం కావాలి. నలుగురు వినాలి. వారి జీవితాలు మంచిబాటకు పోయేందుకు ఉపయోగపడాలి...''

ఆమె అతను వారిస్తున్నా వినక కాఫీ కప్పులు కడిగింది.

''నర్మద ఇంటి నుండి వెళ్లిపోయిన ఎనిమిది నెలల తరువాత ఒక మిత్రుడు ఉత్తరం వ్రాశాడు – 'నర్మద బెజవాడలో ఉంది. నేను ప్రత్యక్షంగా ఆమె పరిస్థితిని చూశాను. ఆమె పరిస్థితి ఏమీ బాగా లేదు. ఆలస్యం చేయక వెళ్లి నీ వెంట తీసుకుని రా' అని. అత నిచ్చిన అడ్రెస్ ప్రకారం బెజవాడకు పరుగెత్తాను. చూశాను నర్మదను. గుర్తు పట్టలేనం తగా మారిపోయింది నర్మద. చెంపకు చేరడేసి ఉండే కళ్లు కాంతి విహీనాలైనాయి. గులాబీలు పూచే మొగ్గలు పాలిపోయాయి. తాచుపాములాంటి జడకు సంస్కారం లేదు. చిరిగిన బట్టలతో, ఎముకలు వెళ్లకొచ్చే శరీరంతో రోడ్డు పక్కన ఉండే ముష్టి దానిలా ఉంది నే వెళ్లేసరికి. నన్ను చూడగానే బావురుమని ఏడ్చింది.

'అతనేడమ్మా?' నెమ్మదిగా అడిగాను.

'ఉద్యోగం కోసమని మద్రాసు వెళ్లారు, నాన్నా! అప్పుడే మూడు నెలలైంది. ఆయన కోసమే ఎదురు చూస్తున్నాను' అంది.

'మూడు నెలలై ఒంటరిగా ఉన్నావా, అమ్మా! పోనీ ఉత్తరమైనా వ్రాయలేదా?' అడిగాను.

'వ్రాశారు, నాన్నా! వెళ్లిన తరవాత ఒక ఉత్తరం. తరవాత ఏదో సినిమా కంపె నీలో ఉద్యోగం దొరికింది! నిన్ను తీసుకెడతాను వచ్చి, అని వ్రాస్తూ ఏభై రూపా యలు కూడా పంపారు. ఏ క్షణంలో వస్తారో అనే కనిపెట్టుకుని ఉన్నాను, నాన్నా!''

'మోసపోయావమ్మా! ఎన్ని సంవత్సరాలు ఎదురుచూచినా ఇంతే, నర్మదా! అతను రాడు. నాకు తెలుసు' అన్నాను.


'అలా అనకు, నాన్నా! ఆయన నన్నెంతగా ప్రేమిస్తున్నారో నీకు తెలియదు. మేము పారిపోయి వచ్చామనే నీవలా అంటున్నావు. అలా మోసం చేసే మనిషి కారు నాన్నా ఆయన' అంది నర్మద.

అంతగా నమ్మిన నర్మద మనసును మార్చలేక పోయాను. నర్మద ఇచ్చిన చిరు నామాను పట్టుకుని మద్రాసు వెళ్లాను. నర్మద ఇచ్చిన ఫొటోను పట్టుకుని సినిమా కంపెనీలో వాకబు చేశాను. అతణ్ణి చూచినట్టుగాని, అతను ఆ కంపెనీలో పనిచేసి నట్టు గాని ఎవరూ చెప్పలేకపోయారు. అదే విషయాన్ని నర్మదకు చెప్పాను. కాని, నర్మద నా మాటలు నమ్మలేదు. 'నన్ను ఇక్కడ నుండి తీసుకెళ్లాలని మీ ఎత్తు. నే చస్తే చస్తాను గాని, ఈ ఇంటిని వదిలిపెట్టి రాను. నేనిక్కడ నుండి వెళ్లిపోతే నే కన పడక ఆయన పిచ్చివారై పోతారు' అంది. నర్మదను చూచి బాధపడాలో, జాలి పడాలో, కోపపడాలో తెలియలేదు. చేసేదేమీ లేక కొద్దిసేపు ఏడ్చాను. చివరికి నర్మదను ఆ ఇంటివారికి అప్ప చెప్పి, నర్మదకున్న అప్పులన్నింటిని తీర్చివచ్చాను. మూడు మాసాలు గడిచాయి. నర్మద ఆడపిల్లను ప్రసవించింది. మరి మూడు రోజులకే తెలిసింది. రమేష్‌కు పెళ్లయిందని, అతను రాజమండ్రిలో ఉన్నాడని. కాని, నర్మదకా స్థితిలో చెప్ప సాహసం కలగలేదు నాకు. నెల రోజులు పోయిన తర వాత ఇద్దరు ముగ్గురి ద్వారా చెప్పించాను. నర్మద వారి మాటలు నమ్మలేదు. చివ రికి నర్మదను, పాపను తీసుకుని అతడి దగ్గరికెళ్లాను. ఆ అపర దుష్యంతుడు నర్మ దను చూచి 'నీ వెవరో నాకు తెలియ'దన్నాడు. నర్మద ఏడ్చింది. 'నీకు నే నేం తాళి కట్టలేదు, ఫో!' అన్నాడు.

'నాకు అన్యాయం చేస్తారా? ఈ పాప ముఖమేనా చూడండి' అంది.

'నీకు జరిగిన అన్యాయమేదీ లేదు. ఎవరి సుఖాన్ని వారు వెతుక్కున్నారు. తప్పులేదు' అన్నాడు.

నర్మద తనకు జరిగిన పరాభవాన్ని నిగ్రహించుకోలేక పోయింది. రెండు మూడుసార్లు ఆత్మహత్యా ప్రయత్నాన్ని కూడా చేసింది. కాని, నా అదృష్టం వల్ల బ్రతి కింది. నర్మద మాత్రం మారి పోయింది. క్రమక్రమంగా మతి చలించటం ప్రారంభిం చింది. ఇప్పుడు నర్మద మందులేని వ్యాధితో బాధప డుతూ, విశాఖ మెంటల్ హాస్పిటల్‌లో ఉంది. పిచ్చి వాళ్ల మధ్య చావు కోసం ఎదురు చూస్తూ ఉంది నా బంగారు తల్లి!'' రాఘవ రావు దుఃఖాన్ని నిగ్రహించు కోలేక పోయాడు.



## శ్రీదేవి దెబ్బకు కళ్లు తిరిగిన నిర్మాత!

ఒకప్పటి అందాల తార శ్రీదేవి బోనీకపూర్‌ని పెళ్లి చేసుకున్న తరువాత ఇన్ని సంవత్సరాలు నటనకు దూరంగా ఉంది. ఇంత లేటు వయసులో ఇప్పుడు ఆమెకు తిరిగి తెర మీద కనిపించాలన్న కోరిక కలిగింది. దాన్ని కోలీ వుడ్ ద్వారా తీర్చుకోవాలని ముచ్చటపడింది. శ్రీదేవి ముచ్చటను తీర్చడానికి ఓ నిర్మాత ముందుకొచ్చాడు. సూపర్‌స్టార్ రజనీకాంత్ మేనల్లుడు ధనుష్ అత్త పాత్రలో కోలీవుడ్‌లో మెరుపులు మెరిపించడానికి శ్రీదేవి సిద్ధమైంది. అయితే ఆమె రెమ్యునరేషన్ విన్న నిర్మాతకు కళ్లు తిరిగాయట! ఎంతనుకు న్నారు? అక్షరాలా 80 లక్షలు. అదీ టాక్స్‌లూ అవీ మినహాయించుకొనట! అంటే దాదాపు కోటి రూపాయల పారితోషికమన్నమాట! ఇది కుర్ర హీరోలు తీసుకునే పారితోషికంతో సమానమన్నమాట! పాపం ఆ నిర్మాత శ్రీదేవి దెబ్బ నుంచి కోలుకునేటప్పటికి రెండు మూడురోజులు పట్టిందట!

ఆమె కన్నుల్లో కన్నీరు ఉబికింది.

''అతని చేత పరాభవాన్ని పొందిన తరవాత నర్మద అన్న మాటలు నే మరిచి పోలేను. ఆ మాటలు నా గుండెను పిండేస్తాయి. బాధను తవ్వి పోగులు పోస్తాయి. నర్మద ఏమందో తెలుసా?''

''ఎ.... ఎ... ఏమంది, బాబుగారూ?''

''నాన్నా! ఆ వర్షం రోజు రాత్రి నీవు గాని, అమ్మగాని మరి ఎవరైనా నన్ను ఆపి, మందలించి ఉండి ఉంటే ఇప్పుడీ అవమానం నాకు తప్పేదిగా, నాన్నా! నేను తప్పు చేస్తే శిక్షించే హక్కు నీకులేదూ? ఒక లెంపకాయ ఇచ్చి, మెడబట్టి ఇంటిలోకి గెంటి ఉంటే నాకీ బాధ తప్పేదిగా, నాన్నా! నన్నెందుకు ఆపలేదు, నాన్నా? నన్నెం దుకు ఆదుకోలేదు, నాన్నా?'' అంటూ ఏడ్చింది. నర్మద మాటలు జ్ఞాపకానికి వచ్చి నప్పుడల్లా గడిచిన కాలాన్నంతా దాటి వెనకకు పరిగెత్తిపోయి... నర్మదను... అమ్మలూ, అదేమిటి? ఏడుస్తున్నావా?'' అడిగాడు రాఘవరావు.

''లె... లేదు, బాబుగారూ! నర్మద మాటలు వింటోంటో కన్నీరు తిరిగింది''.

కన్నీరు తుడుచుకుంది. నెమ్మదిగా తల ఎత్తి రాఘవరావు వైపు చూస్తూ, 'బాబుగారూ! అందరూ అతనిలాగే ఉంటారా?'' అని అడిగింది.

ఆమె ప్రశ్నకు సమాధానమీయక ''నీ పేరేమిటమ్మా!'' అని అడిగాడు.

''నా పేరు ప్రమీల, బాబుగారూ! ముందు నా సందేహం నివృత్తి చెయ్యండి''

అంది.

రాఘవరావు కొద్దిసేపు ఆలోచించి, "ఏ మనిషీ ప్రత్యేకంగా చెడ్డవాడు కాడు, ప్రమీలా! కాని, మంచితనమో, చెడ్డతనమో ఆపాదించబడేది మనిషికే. పరిస్థితుల మీద నేరాన్ని మోపటం కూడా న్యాయం కాదు. పరిస్థితిని అర్థం చేసుకుని మనిషి వ్యవహరించాలి. అందుకు తగిన విజ్ఞత మనిషికి ఉండాలి. మరి అది ఎక్కడినుండి వస్తుంది? సమాజం నుండి. సమాజమంటే ఎవరు? నీవూ, నేనూ, కోనారీ, సింహాచలానికి టిక్కెట్టు తీసుకున్న యాత్రికులు. నా జీవితం నుండి నేను నేర్చుకోలేని పాఠాలను నీవు నేర్చుకోగలవు. నా జీవితం చెడుమార్గాన పోతున్నప్పుడు నీవు నీ మార్గాన్ని దిద్దుకోవాలి. దానికి విజ్ఞానం కావాలి. ఎటువంటిదా విజ్ఞానం? మనం సమాజాన్ని చూడగలిగితే చాలు. నర్మద చరిత్ర నర్మదకు ఉపయోగపడదు. 'ఆమె లాగా తప్పుచేసే వారికి ఉపయోగపడుతుంది. రమేష్ జీవితమూ అంతే".

"ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పండి, బాబుగారూ!"

"అయితే, నీకింకా అర్థం కాలేదా? నర్మదలున్న ప్రతీచోట రమేష్‌లున్నారు. వాళ్లెప్పుడూ పలాయనం చిత్తగిస్తూనే ఉంటారు. ఆమె తల్లితండ్రులకు నచ్చచెప్పి ఆమెను వివాహ మాడలేక ఆమెతో పారిపోయిన వాడు – రేపు ఆమె వల్ల ఏర్పడే సమస్యలు తట్టుకోలేక ఆమెను విడిచి పారిపోడని గ్యారంటీ ఏమిటి? పిరికివాడెప్పుడూ పరిస్థితుల నుండి పారిపోవాలనే చూస్తాడు. తను మంచిదారిలో వెళుతూ, ఎదుటి వారికి సవ్యదిశలో నడిపించే వారే కావాలి సమాజానికి. అటువంటి వారరుదు".

ప్రమీల ఏదో అడగాలని తల ఎత్తి దించుకుంది.

పాసెంజరు ట్రెయినుకి టి.పి.లైన్ క్లియర్ గంట కొట్టాడు.

రాఘవరావు కుర్చీలోంచి లేస్తూ, "అమ్మలూ! మీ బండికి లైన్‌క్లియర్ అయింది" అన్నాడు.

"అవును. లైను క్లియర్ అయింది" అంది ప్రమీల.

"లే! లేచి కొద్దిగా కాళ్లూ, చేతులూ, ముఖం కడుక్కుని తయారవు. ఈ దీపాన్ని తీసుకెళ్లు. బాత్‌రూములో సబ్బు, తువ్వాలు ఉంటాయి".

ప్రమీల కదలలేదు. ఏదో ఆలోచిస్తూ తలదించుకుని ఉంది.

"అమ్మలూ, ప్రమీలా!" హెచ్చరించాడు రాఘవరావు.

"నేను వెళ్లబోవటం లేదు, బాబుగారూ! నేను వెళ్లను" అంది ప్రమీల.

"అదేమమ్మా?!"

"అదంతే, బాబుగారూ నేను వెళ్లను. నన్ను మాత్రం మీరు తోడుగా వచ్చి మా ఇంటికి దిగబెట్టి వెళ్లిపోండి. తెల్లవారేలోగా నేను ఇల్లు చేరాలి. మా నాన్నగారికి కూడా మీరే నచ్చ చెప్పాలి" అంది తలదించుకునే ప్రమీల.

"అంతా విచిత్రంగా ఉందమ్మా! నీ గురించి నాకేం తెలుసని చెప్పమంటావు. చెప్పు?"

"నాచేత చెప్పించాలని గాని, మీరామాత్రం గ్రహించలేదా? నేనూ.... నర్మద లాగే... కాని, అతనక్కడున్నాడు... నా పెళ్లి నిశ్చయమైంది... అందుకనే బయలుదేరి పోవాలనుకుని ఇక్కడికొచ్చాను. కాని, వెళ్లను. నర్మద, రమేష్‌లు జంటగా బయలుదేరి కూడా జంటగా ఎక్కువకాలం ఉండలేకపోయారు. ఆమె నాశనమైంది. అతడు హాయిగానే ఉన్నాడు. మరి ఒంటరిగా వెళుతున్న నన్ను ఆదరించక 'నీవెవరు?' అంటే, నేనేం చేయాలి? ఏమీ చేయని నేరానికి అందరి మధ్యదోషిగా నిలబడక తప్పదు. నేనేం నేరం చేయలేదు. కాని, తెల్లవారే లోపుగా మాత్రం... మీ సహాయాన్ని జన్మజన్మలకు మరిచిపోను" ప్రమీల కళ్లవెంట నీళ్లు తిరిగాయి.

రాఘవరావు ఒక నిట్టూర్పు విడిచి ఇంటికి తాళం వేశాడు.

నిద్ర నుండి లేచిన రంగసామి జట్కా కట్టాడు.

పాసెంజరు అవుటర్ సిగ్నల్ దగ్గర అరుస్తూంది.

జట్కా కృష్ణాపురం వైపు బయలుదేరింది.

***


"ఈ పెళ్లి సందడిలో నీవొచ్చావన్నది విన్నానే గాని, పలకరించటం కాలేదు, రాఘవా! నీవు దేవుడిలా ఆదుకున్నావు. లేకపోతే ప్రమీల పెళ్లి జరిగేది కాదు".

"నేనే చేసిందేముందిలే, పార్వతీ! నన్ను పొగడకు" తల దించుకుని అరటి బోదలకేసి చూస్తూ అన్నాడు రాఘవరావు.

"అలా అనకు, రాఘవా! ప్రమీల నా కంతా చెప్పింది. నీవు ప్రమీలను వెంట పెట్టుకుని రావటం నేను చూశాను. నీవు ఆయనతో మాటాడటం కూడా విన్నాను. కాని, ఆ రాత్రి వేళ 'నీవు' అని గుర్తు పట్టలేదు. ఈనాడు పందిరిలో చూశాను. గుర్తు పట్టాను. నీవు దేవుడివి. నన్ను, నా కుటుంబాన్ని రెండుసార్లు ఆదుకు

**కథాకళి**

## పోటీ పడితేనే జీవితం



"అరేయ్! గురువుగారి పక్షపాతం శ్రుతి మించుతోంది. మనకు అరకొర చదువు చెబుతూ, ఆనందుడికి మాత్రం అన్నీ నేర్పిస్తున్నాడు" ఆక్రోశించాడు అరవిందుడు.

"అవునురోయ్. నువ్వన్నది నిజం" వంతపాడారు మిగతా వారు.

"గురువుగారిని దారిలోకి తేవాల్సిందే. లేకపోతే ఆనందుడు ముందు చదువు ముగించుకోవడం, మనం మాత్రం వెర్రివాళ్లలా ఇక్కడే ఉండిపోవడం తథ్యం" అన్నాడు అరవిందుడు.

"నువ్వన్నది నిజమే! కానీ గురువుగారిని తేరిపార చూడాలంటేనే మనకు భయం. ఆయనతో విషయం ఎలా చెప్పేది?" సందేహించారు మిగతా శిష్యులు.

"గురుపత్నిని శరణు వేడదాం. అమ్మగారైతేనే న్యాయం చేస్తారు. అమె తల్లిలా అందర్నీ సమానంగా చూస్తారు" అన్నాడు అరవిందుడు. అదే విషయాన్ని వెళ్లి గురుపత్నికి ఫిర్యాదు చేశారు.

"మీరు చెప్పేది అబద్ధంరా! గురువుగారు ఎప్పుడూ అలా చేయరు. అయినా మీరు అందరూ ఒకే మాటగా చెబుతున్నారు కనుక నేనూ అడిగి చూస్తాను" హామీ ఇచ్చింది గురుపత్ని. రాత్రికి గురువుగారు ఇంటికి రాగానే విషయాన్ని ఆయనకు వివరించింది.

"ఓహో అలా అన్నారా? అయితే ఒక పని చేద్దాం. నేను నిండా దుప్పటి కప్పుకుని పడుకుంటాను. నువ్వేమో పక్కనే కూర్చుని ఏడుస్తూ ఉండు. ఎవరైనా వచ్చి ఏమైందని అడిగితే... చంకలోనికి తొండ వెళ్లింది. అందువల్ల గురువు చనిపోయారు అని చెప్పు" అని భార్యకు సూచించాడు గురువుగారు!

వెంటనే దుప్పటి కప్పుకొని పడుకున్నాడు. గురుపత్ని ఏడవడం మొదలు పెట్టింది. అది విని ఒక్కో శిష్యుడూ రావడం మొదలు పెట్టారు. వచ్చిన వారికల్లా గురుపత్ని... "చంకలోనికి తొండ వెళ్లింది. అందువల్ల గురువుగారు చనిపోయారు" అని చెప్పడం మొదలు పెట్టింది.

శిష్యులంతా నమ్మేశారు. 'అయ్యో గురువుగారు పోయారా? ఇక మాకు చదువు చెప్పే వారెవరు?' అని వాళ్లూ ఏడవడం మొదలుపెట్టారు.

పక్క ఊరికెళ్లిన ఆనందుడు ఆఖరున అక్కడికి వచ్చాడు.

'ఏమైంది? మీరంతా ఎందుకు ఏడుస్తున్నారు?' అని అడిగాడు.

"గురువుగారి చంకలోనికి తొండ వెళ్లింది. అందువల్ల ఆయన చనిపోయారు" అని చెప్పింది గురుపత్ని.

"ఆనందుడు నమ్మలేదు. ఆలోచించాడు. చంకలో రంధ్రమే లేదు. అందువల్ల తొండ లోపలికి పోవడం అసాధ్యం. అందువల్ల గురువుగారు చనిపోవడం కూడా అసంభవం. ఇందులో ఏదో మతలబు దాగుంది" అని నిర్ధారణకు వచ్చాడు.

"గురువుగారూ! నాకు తెలుసు. మీరు చనిపోలేదు. మమ్మల్ని పరీక్షిస్తున్నారు. దయచేసి లేవండి. ఎందుకు మమ్మల్ని పరీక్షిస్తున్నారో చెప్పండి" అని వేడుకున్నాడు.

వెంటనే గురువుగారు నవ్వుతూ లేచి కూర్చున్నారు.

నీతి: మనలో చాలామందిమి ఇతరుల చదువును, సంపదను చూసి ఈర్ష్య పడుతుంటాం. మనసులో కుతకుతలాడుతుంటాం. వారికి అంత ఎలా వచ్చింది? అదేం అదృష్టం? మనకెందుకు రాలేదు? అని మథన పడుతుంటాం. భౌతికంగా మనందరి రూపం ఒకే మాదిరిగా ఉన్నప్పటికీ, బౌతికంగా మన మధ్య చాలా తేడాలుంటాయి. దాన్ని గుర్తించకుండా అసూయ పడడం వల్ల మనకు మనమే వేదన చెందడం తప్ప మిగిలేదేమీ ఉండదు. తెలివితేటలైనా, చదువైనా, సంపదైనా... పెరిగిన నేపథ్యం, కష్టించే స్వభావం, గ్రహణ శక్తి, చూపే సాహసం ఆధారంగా ఒక్కొక్కరికి ఒక్కో స్థాయిలో అబ్బుతాయి. ఎవరికి పట్టే 'అదృష్టం' వెనకైనా ఏదో ఒక కళ ఉంటుంది. అలాంటి లక్షణాలను పెంచుకోవడం మాత్రమే వారితో పోటీ పడేందుకు ఏకైక మార్గం. పోరాట పటిమ ఉన్న జీవులే మనుగడ సాగించ గలుగుతాయని కదా ఆధునిక శాస్త్రం చెబుతున్నది!

**– తిగుళ్ళ కృష్ణమూర్తి**

న్నావ్...'' ఆగిపోయి, అటు ఇటు చూచి కొద్దిగా దగ్గరగా వచ్చి స్వరాన్ని తగ్గించి, ''ఆనాడు నేనే సాహసం చేశానో, ఈనాడు అదే సాహసాన్ని చేసింది ప్రమీల. ఆనాడూ నన్ను ఇలానే వారించి వెనకకు పంపావు. నీలాగ మనుషులను, పరిస్థితులను అర్థం చేసుకుని త్యాగం చేయగలిగిన వారెందరు! ఆనాడు నీవు చేతకానివాడివని, పిరికివాడివని, అసమర్థుడివని నిందించాను. ఏడ్చాను. తరవాత అర్థమైంది నీవు లోకాన్నెంత బాగా అర్థం చేసుకున్నదీ! నీవు సామాన్యుడవు కావు, రాఘవా? దేవుడివి'' అన్నది. ఆమె కళ్లు కొద్దిగా చెమర్చాయి.

''కాదులే, పార్వతీ, నేను మామూలు మనిషినే! వస్తాను. సెలవియ్యి'' చేతులు జోడించాడు రాఘవరావు.

''వెళ్లిపోదువుగానిలే, రాఘవా! తొందరేం? తల ఎత్తు! సిగ్గు పడతావేం? నేను ఆనాటి పార్వతిని కాను.... నాకొక విషయం చెప్పు, రాఘవా! ప్రమీల నా కూతురని నీకెలా తెలుసు? ప్రమీలను నీవెలా గుర్తుపట్టావు?''

రాఘవరావు కొద్దిసేపాగి అన్నాడు: ''ప్రమీల నీ కూతురని నాకు తెలియదు. అసలు ప్రమీలను ఇంతకు మునుపు నేనెప్పుడూ చూడలేదు. కాని, ఆమె ముఖంలో నీ పోలికలు చాలా కనిపించాయి. ఆమె కూర్చున్నప్పుడు ఒక పక్కగా చూస్తే నీవేనేమో అనే భ్రాంతి కూడా కలిగింది. ఆమె నడుస్తున్నా, మాట్లాడుతున్నా నీవే గుర్తుకొచ్చావు. వెనువెంటనే 'ఆ రాత్రి' గుర్తుకువచ్చింది. ప్రమీల తొందరపాటుకు బాధ కలిగింది. రంగసామి నామీద ఉన్న గౌరవం చేత ప్రమీల గురించి అంతా చెప్పాడు. నీవే గుర్తుకొస్తూంటే ప్రమీల మీద జాలిచూపక తప్పలేదు. రంగసామిని వెళ్లిపోవద్దని చెప్పి వచ్చాను. ప్రమీల నీ కూతురయి ఉంటుందని మాత్రం నేను ఏదీచేయలేదు. ప్రమీల ఎవరైనా నే చేయగలిగేది అదే. నే నా ఊరిస్టేషన్ మాస్టరుగా ఉన్నంతకాలం నా చేతిమీదుగా ఇలాంటివారికెప్పుడు టిక్కెట్టు ఇవ్వను, పార్వతీ? ఇది నిజం''.

''ఇంతమందిని రక్షించిన నీవు నర్మదను మాత్రం రక్షించుకోలేక పోయావు''.

''ప్రమీల లాంటి వారి కోసం నర్మద లాంటి వారు ఉండాలి, పార్వతీ!''

''నిండు కుండవు. భార్య పోయింది. కూతురు అలా అయింది. చిన్నకూతురు సంసారం సరిలేదు. అయినా, నీవు తొణకటం లేదు. బాధపడటం లేదు''.

''బాధపడినంత మాత్రాన ప్రయోజనమేమిటి, పార్వతీ! ఎవరి జీవితాన్ని వారు జీవించక తప్పదు. మనం చెప్పినట్టు జీవితం ఉండదు. జీవితం చెప్పినట్టు మనం నడవాలి. బాధను బాధగానే తీసుకుంటే బ్రతకలేం?''

''అంతా నాటకంలో మాటాడినట్టు మాటాడతావు, రాఘవా? ఇంకా నాటకాలు వేస్తున్నావా?''

''లేదు, పార్వతీ! మానేశాను. నేను జీవిస్తున్నా నటిస్తున్నానని, నేను ఒక నాటకాల రాయుడినని, నా ఆరాధన ఒక నాటకమని మీ వాళ్లంతా నన్ను దూరం చేసిన తరవాత... నాటక రంగం మీద జీవించిన నేను, వాళ్లందరి తృప్తికోసం నిన్ను దూరం చేసుకున్నాను. ఆ నాటి నుండి స్టేజి ఎక్కటం మానేశాను. కాని జీవితంలో నటించక తప్పదుగా? అప్పుడప్పుడు నటిస్తున్నాను. ఆ రాత్రి కూడా ప్రమీల ముందు నటించక తప్పలేదు'' తల దించుకున్నాడు రాఘవరావు.

''అంటే?''

''నర్మద నా కల్పన'' తల దించుకునే అన్నాడు.

''కల్పనా?! .... మరి... మరి... గుండెజబ్బుతో మరణించిన భార్య!''

''నాకు భార్య లేదు''

''రాఘవా! నీకు భార్యలేదూ! మరి... మరి... నీవు...''

''ఆc! నేను, నేనే... నాకు నేనే... వస్తాను!''

''రాఘవా! ఆగు. నీ పరిస్థితికి నే బాధ పడకూడదని ఇలా అంటున్నావా?.... ఇది కూడా నటనేనా?'' పార్వతి గొంతు బొంగురుపోయింది.

సన్నగా నీరసంగా నవ్వాడు రాఘవవావు.

''నటనే, పార్వతీ, నా జీవితమంతా నటనే! ఈ నటనే, పార్వతీ. నన్ను కోరుకున్న అమ్మాయిని నాకు దగ్గర చేసింది. ఈ నటనే నా నుండి ఆమెను దూరం చేసింది. ప్రమీల రహస్యాలు నాకు తెలుసని రంగసామి ముందు నటించాను. ఇది నిజమే. కాని, ఇప్పుడు మాత్రం... ఈ క్షణాన మాత్రం నటించడం లేదు, పార్వతీ! నన్ను నమ్ము!'' ఎడమ భుజం మీద నుండి ఛాతీ మీదుగా కుడిపక్కకు పోతున్న మూడు జంధ్యం పోగులను కుడిచేతితో బయటకులాగి ఆమెకు కనిపించేలా చూపించి, వెను తిరిగి గబగబా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు రాఘవరావు.

*

(జంధ్యం మూడు పోగులు మాత్రమే వుంటే యింకా బ్రహ్మచారిగా వున్నట్టు గుర్తు. వివాహితుడికి అయిదు పోగులు వుంటాయి- రచయిత)

